18వ వసంతంలోకి
నేటి దినపత్రిక
సూర్య
www.suryaa.com
చిత్తూరు | తిరుపతి
ఆదివారం | 1 సెప్టెంబర్ 2024 | పేజీలు 8

## తుడా అభివృద్ధికి కృషి చేస్తాను

### తుడా వైస్ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన ఎన్.మౌర్య

**తిరుపతి బ్యూరో, మేజర్‌న్యూస్:** తిరుపతి అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ (తుడా) అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని వైస్‌చైర్మన్ ఎన్.మౌర్య అన్నారు. శనివారం సాయంత్రం తుడా వైస్ చెర్మన్‌గా ఎన్.మౌర్య పూర్తి స్థాయి బాధ్యతలు స్వీకరించారు. ఆమె మాట్లాడుతూ తుడా వైస్ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టడం తనకు ఎంతో సంతోషకరమన్నారు. తిరుపతి నగర పాలకసంస్థ కమిషనర్‌గా జులై 24న బాధ్యతలు చేపట్టానన్నారు. 2019 వరకు నగరపాలక సంస్థ కమిషనర్ తుడాకు కూడా పూర్తి బాధ్యతలు నిర్వహించే వారన్నారు. అటు తరువాత ప్రభుత్వం నిర్ణయం తీసుకుని తనకు తుడా వైస్ చైర్మన్‌గా పూర్తి స్థాయి బాధ్యతలు అప్పగించారన్నారు. తుడా, నగరపాలక సంస్థ సంయుక్తంగా అనేక అభివృద్ధి పనులు చేయడం జరిగిందన్నారు. నగర పాలక సంస్థ, తుడాల అభివృద్ధికి శక్తీ వంచన లేకుండా కృషి చేస్తానని అన్నారు. తుడా వీసీగా బాధ్యతలు చేపట్టిన మౌర్యను ఇంచార్జి వీసిగా పనిచేసిన వెంకట నారాయణ, నగరపాలక సంస్థ, తుడా అధికారులు పుష్ప గుచ్ఛం అందించి అభినందనలు తెలిపారు.



## ఏపీలో మహిళలకు, ఆడపిల్లలకు రక్షణ కరువైంది

**ప్రభుత్వం తీరు సిగ్గుచేటు అంటూ సంచలన వ్యాఖ్యలు చేసిన మాజీ మంత్రి ఆర్కే రోజా**

**తిరుమల, మేజర్‌న్యూస్:** ఏపీలో మహిళలకు, ఆడపిల్లలకు రక్షణ కరువైందని మాజీ మంత్రి ఆర్కే రోజా విమర్శలు చేశారు. శ్రీవారిని శనివారం ఉదయం విఐపి విరామ సమయంలో పాల్గొని రోజా మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం టీడీపీ ప్రభుత్వంపై నిప్పులు చెరిగారు. ఆలయం వెలుపల మీడియాతో మాట్లాడుతూ ఎక్కడ చూసిన రేప్, మర్డర్లు, బాత్ రూంలలో హిడెన్ కెమెరాలు పెట్టి పైశాచిక ఆనందం పొందుతున్నారని విమర్శించారు. నేరస్తులకు ఇంతధైర్యం రావడానికి కారణం ప్రభుత్వమేనన్నారు. ఈ పరిస్థితి చూసి ప్రభుత్వం సిగ్గుపడాలన్నారు. దిశయాప్ ద్వారా గత వైసీపీ ప్రభుత్వం నిందితులను పట్టుకుని 24గంటల్లో శిక్షించారని గుర్తు చేశారు. జగనన్న పాలనలో ఇలాంటి ఘటనలు



మిగతా 2లో

## గర్భస్థ లింగనిర్ధారణ పరీక్షలు నిర్వహించి దుర్వినియోగం చేస్తే కఠిన చర్యలు

**జిల్లా కలెక్టర్ డా.ఎస్. వెంకటేశ్వర్**



**తిరుపతి బ్యూరో, మేజర్‌న్యూస్:** గర్భస్థ లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహించి దుర్వినియోగ పరచరాదని, సదరు స్కానింగ్ పరీక్షల ద్వారా గర్భస్థ శిశువు ఎదుగుదల పరిశీలించుటకు మాత్రమే వినియోగించాలని దుర్వినియోగంచేస్తే కఠినచర్యలు ఉంటాయని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్ పేర్కొన్నారు. శనివారం ఉదయం స్థానిక కలెక్టరేట్ నందు జిల్లా కలెక్టర్ డిస్ట్రిక్ట్ మల్టీ మెంబర్ అప్రాప్రియెట్ అథారిటీ కమిటీ చైర్మన్ హోదాలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి, పోలీస్ అధికారులు అదనపు తదితర కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించి దిశా నిర్దేశం చేసారు. కలెక్టర్ మాట్లాడుతూ గర్భస్థ లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహించి దుర్వినియోగం చేయరాదని, స్కానింగ్‌పరీక్షల ద్వారా గర్భస్థ శిశువు ఎదుగుదల పరిశీలించుటకు

మిగతా 2లో

## పారిశ్రామిక నగరం (క్రిస్‌సిటీ)లో పేదలు సమిధలేనా..?

**పరిహారం ఇవ్వని ప్రభుత్వం... ఆందోళనలో పేదలు**

**మోడీతోనైనా ఆశలు తీరేనా!**



**గూడూరు, మేజర్‌న్యూస్:** భూమిని నమ్ముకున్న పేదలకన్నా... పరిశ్రమల పేరుతో తీసుకుని భూమిని అమ్ముకునే పెద్దలకు కాపుకాస్తున్న పాలకుల నైజంపై సర్వత్రా విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. సెప్టెంబర్ మొదటి వారంలో కృష్ణపట్నం పోర్టు సిటీకి గూడూరు సమీపంలోని చిల్లకూరు వద్ద ప్రధానమంత్రి నరేంద్రమోడి శంఖుస్థాపన చేయనున్న నేపథ్యంలో భూముల పరిహారం విషయం మరోసారి వెలుగులోకి వచ్చింది. గూడూరు డివిజన్ పరిధిలో 2009 నుంచి ప్రారంభమైన పారిశ్రామికీకరణ ఈప్రాంతంలో మార్పు తీసుకురాకన్నా పరిశ్రమలకు భూములు ఇచ్చిన పేదలను మాత్రం నిరుపేదలుగా మార్చిందని చెప్పవచ్చు. పరిశ్రమలు వస్తే తమ ప్రాంతం... తమ బిడ్డల భవిష్యత్ బాగుపడుతుందని చదువుకున్న మేధావులు వచ్చి ప్రజాభిప్రాయ సేకరణ సమయంలో ఇచ్చిన ఉపన్యాసాలు తమను బికారులుగా మార్చాయి తప్ప భవిష్యత్‌పై ధీమా ఇవ్వలేదని వాపోతున్నారు. పెద్దోళ్లు పట్టణ ప్రాంతాలకు పోయి స్థిర పడితే భూములు కోల్పోతే వచ్చిన నామమాత్రపు పరిహారంతో లేని ఆడంభరాలకు పోయి పరిశ్రమలు వస్తే ఉపాధి వచ్చి బాగుపడతాములే అనుకుంటే అవి రాక బికారులుగా మారి ఇచ్చిన భూముల్లోనే కూలీలుగా బతుకులీడుస్తున్నారు. అయితే ప్రభుత్వాలు మాత్రం తాము అది చేశాం... ఇది చేశామని చెపుతూ ప్రజలను ఏమార్చే పనిలోనే కాలం గడుపుతోందన్న ఆరోపణలు వస్తున్నాయి. చిల్లకూరు, కోట మండలాల

మిగతా 2లో






## గర్భస్థ లింగనిర్ధారణ పరీక్షలు నిర్వహించి దుర్వినియోగం చేస్తే కఠిన చర్యలు

(మొదటిపేజీ తరువాయి)

మాత్రమే వినియోగించాలని దుర్వినియోగం చేస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ప్రీ నేటల్ డయాగ్నోస్టిక్ టెక్నిక్స్ (నిబంధన, దుర్వినియోగం నివారణ) నియమాలు 1994, 1996 మేరకు ప్రీ-కాన్సెప్షన్, ప్రీ-నేటల్ డయాగ్నోస్టిక్ టెక్నిక్స్ (లైంగిక ఎంపిక నిషేధం) చట్టం పక్కాగా అమలు కావాలని ఆదేశించారు. డి ఎం హెచ్ ఓ వివరిస్తూ డెకాయ్ ఆపరేషన్ నిర్వహిస్తున్నామన్నారు. విన్స్ ఎన్జీఓ మాట్లాడుతూ ఆడ పిల్లలపై చిన్న చూపు పోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది అని గట్టి చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో కమిటీ కన్వీనర్ డిఎంహెచ్ఓ శ్రీహరి,అదనపు ఎస్పీ వెంకట్రావు, విన్స్ స్వచ్ఛందసంస్థ నిర్వాహకురాలు మీరా, పోలీస్ మెడికల్ ఆఫీసర్ మాధురి పాల్గొన్నారు.

## సాకం కృష్ణమూర్తికి డాక్టరేట్

**తిరుపతి రూరల్, మేజర్‌న్యూస్:** ఏషియా ఇంటర్నేషనల్ కల్చరల్ రీసెర్చ్ యూనివర్సిటీ వారి ఆద్వర్యంలో ఏషియా ఇంటర్నేషనల్ కల్చరల్ అకాడమీ వారు కర్ణాటక, హొసూర్ లో శనివారం జరిగిన అవార్డుల ప్రధానోత్సవ కార్యక్రమంలో గత 25 సంవత్సరములుగా రియల్స్ స్వచ్ఛంద సంస్థ తరపున తిరుపతి,చిత్తూరు, అన్నమయ్య జిల్లాలలో ఎన్నో సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నందుకు గానూ సాకం క్రిష్ణమూర్తి, ప్రధాన కార్యదర్శి, రియల్స్ స్వచ్ఛంద సంస్థ, తిరుపతి వారు గౌరవ డాక్టరేట్ అందుకున్నారు.




## గణనీయమైన అభివృద్ధి సాధించిన కేంద్ర విద్యా సంస్థలు

### : ఆచార్య వైవి రామిరెడ్డి

**తిరుపతి ఎడ్యుకేషన్, మేజర్‌న్యూస్:** మాతృదినోత్సవ కార్యక్రమాలలో పాల్గొనడానికి తిరుపతికివిచ్చేసిన భారత మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్య నాయుడుని ఏబిఆర్ ఎస్ఎం రాష్ట్ర అధ్యక్షులు ప్రొఫెసర్ వైవి రామిరెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి అభినం దించారు. ఆయన మాట్లాడుతూ తిరుపతిలో 2014లో వెంకయ్యనాయుడు చొరవతో ఏర్పాటుచేసిన ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఐఐటి), ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ ఎడ్యుకేషన్ రీసెర్చ్(ఐజర్) సంస్థలు నేడు ఏర్పేడులో వేల కోట్ల రూపాయల ఖర్చుతో సొంత స్థలాలలో నిర్మించిన సువిశాలమైన, ఆధునికమైన భవనాలలోకి మారటం జరిగింద న్నారు. వీటి ఏర్పాటు వెనక కృషి ఆయన ఎంతైనా ఉందని వెంకయ్య నాయుడుకి ఏబిఆర్ఎస్ఎం తరపున ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.



## సామాజిక పెన్షన్ల పంపిణీ

**దొరవారిసత్రం, మేజర్‌న్యూస్:** తిరుపతి జిల్లా దొరవారి సత్రం మండలం సింగనాల్తూరు గ్రామంలో ఏర్పాటు చేసిన ఎన్టీఆర్ భరోసా సామాజిక పెన్షన్ పంపిణీ కార్యక్రమలో దొరవారిసత్రం టిడిపి మండల అధ్యక్షులు వేమసాని శ్రీనివాసులు నాయుడు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బందితో కలిసి అవ్వ తాతలకు వారి ఇంటి వద్దకు వెళ్లి పింఛన్లు నగదు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ గతంలో ఎప్పుడూ ఇలా ముంద స్తుగా పెన్షన్ పంపిణీ కార్యక్రమం జరగలేదని ఈ ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గారికి దక్కుతుందని తెలియజేశారు. ఆయన మాట్లాడుతూ పార్టీ పిలుపుమేరకు దొరవారిసత్ర మండలంలోని గ్రామ పంచాయతీలలో ఎన్టీఆర్ భరోసా పెన్షన్ కార్యక్రమంలో పాల్గొని కార్య క్రమాన్ని విజయవంతం చేసిన ప్రతి టిడిపి నాయకులకు కార్య కర్తలకు కృతజ్ఞతలు తెలియజేశారు.



## ఏపీలో మహిళలకు, ఆడపిల్లలకు రక్షణ కరువైంది

(మొదటిపేజీ తరువాయి)

చూడ లేదని స్పష్టం చేశారు. 9 ఏళ్ల అమ్మాయిని చంపేసి ముక్కలుముక్కలు చేశారని చెప్పిన ఆమె. ఘటన జరిగి 60 రోజులు అవుతున్నా అమ్మాయి శవాన్ని తీసుకు రాలేక పోతున్నారని ఆరోపించారు. ఆ కుటుంబాన్ని పరామర్శించడానికి సీఎం, హోమ్ మంత్రి ఎందుకు వెళ్లలేదో చెప్పాల్సిన అవసరం ఉందని డిమాండ్ చేసారు. మదనపల్లెలో ఫైల్ దగ్ధం కేసుపై ఉన్న శ్రద్ధ%ొ% స్పెషల్ ఫ్లైట్ లో వెళ్లి విచారణ చేపట్టాంన్నారు. ఆడపిల్లకు అన్యాయం జరిగితే శ్రద్ధా చూపడం లేదు ఎందుకని ప్రశ్నించారు. హిడెన్ కెమెరాలు పెట్టారని విద్యార్థినులు చెప్తుంటే అలాంటిది ఏమి లేదని ఎస్పీ చెప్పడం సిగ్గు చేటన్నారు. న్యాయం కావాలని 300 మంది విద్యార్థినులు ధర్నాకు దిగితే కంటి తుడుపు చర్యగా విచారణ చేపడుతామని అధికార యంత్రాంగం దిగి రావడం సూచనీయమ న్నారు. నూతన ప్రభుత్వంలో ర్యాగింగ్ బూతం పేట్రేగిపోతుంద న్నారు. నారాయణ కాలేజీలో ర్యాగింగ్ చేసి మెడికల్ విద్యార్థినిని చంపేశారన్నారు. కలికిరి జేఎన్టీయు కళాశాలలో ర్యాగింగ్ కారణంగా విద్యార్థిని ఆత్మహత్య చేసుకుందని తెలిపారు. గత ఐదేళ్లలో లేని ర్యాగింగ్ బూతం ఇప్పుడు మళ్లీ తాండవం చేస్తోందని విమర్శలు చేశారు. రెడ్ బుక్ రాజ్యంగం పై పెట్టిన శ్రద్ధ ఆడపిల్లలు, మహిళల రక్షణపై శ్రద్ధ పెట్టాలని కోరారు. 2014-19లో కూడా ఇలానే చాలా మంది మారారని, వెళ్లే వారి వల్ల పార్టీకి నష్టం ఏమీ లేదన్నారు. పార్టీలు మారే వారికి గౌరవం దక్కదని చరిత్ర హీనులుగా మిగిలిపోతారన్నారు.

## పారిశ్రామిక నగరం (క్రిస్ సిటీ)లో పేదలు సమిధలేనా!

(మొదటిపేజీ తరువాయి)

పరిధిలోని తీరంలో ప్రజల చేతిలో సెంటు భూమి లేదంటే అతిశయోక్తి కాదు. ప్రజల నుంచి నామమాత్రపు పరిహారంతో భూములు తీసుకుని పరిశ్రమల ఏర్పాటుకు కేటాయిస్తే ఇక్కడ వేల ఎకరాలు తీసుకున్న పారిశ్రామిక వేత్తలు ఆ భూములను తాకట్టు పెట్టి వేల కోట్ల రూపాయలు వెనకేసుకోవడం...దివాల దర ఖాస్తులు...లాకైట్లు తప్ప ఈ ప్రాంతంలో పరిశ్రమలు వచ్చింది లేదు ఉపాధి కల్పించిన దాఖలాలు లేదంటే అతిశయోక్తికాదు. సిబిఐసి (చెన్నై బెంగళూరు ఇండస్ట్రియల్ కారిడార్) పారిశ్రామిక నడవాలో భాగంగా 2500 ఎకరాల విస్తీర్ణంలో పారిశ్రామిక నగరం (క్రిస్ సిటీ) ఏర్పాటుకు కేంద్ర పభుత్వం పచ్చ జెండా ఊపింది. పది సంవత్స రాలుగా మరుగున పడిన ఈ ప్రాజెక్ట్ ఎట్టకేలకు పట్టాలెక్కించే పనిలో కేంద్ర ప్రభుత్వం చురుకుగా చర్యలు ప్రారంభించింది. ఈ ప్రాజెక్ట్ పరిధిలో భూసేకరణ అప్పటి నుంచి ఇప్పటికీ సమస్యాత్మకంగా ఉంది. పారిశ్రామిక నడవాలో భాగంగా మౌలిక వసతుల కల్పనకు కేంద్ర ప్రభుత్వం అప్పట్లోనే దాదాపు 2000 కోట్ల రూపాయలు నిధులు మంజూరు చేసింది. అయితే ఆ నిధులను రాష్ట్ర ప్రభుత్వం దారి మళ్లించడంతో ప్రాజెక్ట్ అటకెక్కిందని చెప్పవచ్చు. కేంద్రంలో మూడవసారి అధికారంలోకి వచ్చిన వెంటనే నరేంద్రమోడి దీనిపై ప్రత్యేక దృష్టి పెట్టడంతో అధికారులు ఉరుకులు పరుగులు తీస్తున్నారు. నెల రోజులుగా ఈ పారిశ్రామిక నగరంలో ఏదో జరుగు తుందన్న అనుమానాలకు ఎట్టకేలకు అధికారులు తెర దించారని చెప్పవచ్చు. పారిశ్రమిక నడవాలో భాగంగా తమ్మినపట్నం వద్ద 2500 ఎకరాల్లో ఏర్పాటు చేస్తున్న క్రిస్ సిటి (పారిశ్రామిక నగరం)కి ప్రధనమంత్రి నరేంద్రమోడి సెప్టంబర్ మొదటి వారంలో శంఖుస్తాపన చేయనున్నట్లు అధికారులు ఖరారు. చేస్తున్నారు. అయితే ఇప్పటికీ పారిశ్రామిక నగరం ఏర్పాటుకు సేకరించాల్సిన భూముల పరిహారం విషయం తేలకపోవడంతో పేదలు ఆందోళనకు గురౌతున్నారు. నెల రోజులుగా అధికారులు ఆయా గ్రామాల్లో సర్వే నిర్వహించడం లబ్ధిదారుల జాబితాలు తయారు చేయడంలో తలమునకలై ఉన్నారు. ఇప్పటికీ ఈ భూముల పరిహార విషయం తేలకుండానే పలు సమస్యలపై ఇంకా గ్రామసభలు అర్జీల స్వీకరణలో అధికారులు కాలయాపన చేస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. మంగళవారం జిల్లా కలెక్టర్ ఆద్వర్యంలో రెవెన్యూ అధికారులు దీనిపై సుధీర్ఘ కసరత్తు చేసినట్లు సమాచారం. మరోపక్క పేదలు పెద్ద ఎత్తున తమ పరిహారం విషయం తేల్చందే నిర్ణయం తీసుకుంటే ఆత్మహత్యలు తప్పన మరో మార్గం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ పారిశ్రామిక నడవాలో భాగంగా చిల్లకూరు మండలంలోని మోమిడి, తూర్పుకనుపూ, బల్లవోలు, వేలపాళెం, కోట మండలం కర్లపూడి, సిద్దవరం తదితర గ్రామాల్లో మొత్తం10500 ఎకరాలు సేకరించేందుకు నిర్ణయించి అందులో భాగంగా సర్వే కార్యక్రమాలు కూడ పూర్తి చేసి పరిహారం నిర్ణయం తీసుకోవడంలో పది సంవత్సరాలు జాప్యం చేస్తున్నరంటే వారి నిర్లక్ష్యం ఏపాటిదో అర్ధం అవుతుంది. భూ పరిహార విషయంలో జాప్యం చాలదన్నట్లు అప్పటికే ఆ భూములు సర్వే తదితర అన్ని చర్యలు పూర్తి కావడం కేంద్ర ఇచ్చిన నిధులు దారి మళ్లడంతో ఈ భూముల వ్యవహారం రాష్ట్ర ప్రభుత్వానికి ఇబ్బందిగా మారింది. దీంతో ఈ భూముల రీ-సర్వే సమయంలో భూముల హక్కుదారులైన పేదలను కాదని ఎపిఐఐసికి భూమి హక్కుదారుగా పేర్కొనడం విశేషం. దీంతో అప్పటి వరకు వరకు ఈ భూములపై సర్వ హక్కులు కలిగిన పేదలు నడి వీధిలో నిల్చోపెట్టినట్లుగా మారింది. ప్రభుత్వం నుంచి వచ్చే రాయతీలు కోల్పోగా బ్యాంకుల నుంచి తీసుకున్న రుణాలు తిరిగి తీసుకోవాలన్నా భూమి వివరాలు రాక పోవడంతో ఆందోలన చెందుతున్నారు. పారిశ్రామిక నగరం శంఖుస్థాపన నేపథ్యంలో అయినా రెవెన్యూ అధికారులు ఈ భూముల పరిహారం విషయం తేలుస్తారనుకొంటే మసి పూసి మారేడకాయ చేసేలా ఉన్నారన్న ఆరోపణలు వస్తున్నాయి. కృష్ణపట్నం పోర్టు ఆదారంగా నిర్మిస్తున్న సాగరమాల, భారతమాల బహుళ వరుసల రహదారుల నిర్మాణంతో ఈ ప్రాంతంలో మార్పు వస్తుందని భావిస్తున్నారు. పారిశ్రామిక నడవాలో భాగంగా సాగుతున్న ఈ పనులకు ప్రధానమంత్రి నరేంద్రమోడి రాకతో అయినా మార్పు వస్తే ఆ పరిధిలోని భూముల నిర్వాసితులు కష్టాలు తీరుతాయని భావిస్తున్నారు. రెవెన్యూ అధికారులు పారిశ్రామిక నడవాలోని అన్ని ప్రాంతాల భూముల పరిహారం చెల్లింపుల విషయంపై తగు చర్యలకు శ్రీకారం చుట్టాల్సి ఉంది.

## బీఈడీ కళాశాలలపై పర్యవేక్షణ ఎక్కడ..?

### కళాశాలపై ఎస్వీయూ ఉన్నతాధికారుల చర్యలేవి

**తిరుపతి ఎడ్యుకేషన్, మేజర్‌న్యూస్:** శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయం పరిధిలో దాదాపుగా 14, 15 కళాశాలలో నడుస్తున్నాయి. బీఈడీ కళాశాలన్నిటికీ పర్యవేక్షణ ఎస్వీయూలోని ఐఏఎస్ఇ కళాశాల పర్యవేక్షిస్తుంది. ఈ కళాశాల ప్రిన్సిపాల్ సదరు ప్రైవేట్ కళాశాలలో విద్యార్థుల సంఖ్య, విద్యార్థులు మైక్రో టీచింగ్, అబ్జర్వేషన్ టీచింగ్, బ్లాక్ టీచింగ్ వంటి మూడు రకాల కారకలాపా లను పర్యవేక్షిస్తూ ఉండాలి. సదురు ప్రైవేటు కళాశాలల ప్రిన్సిపాల్ లు కూడా ఎప్పటికప్పుడు ఈ ఐఏఎస్ఈ కేంద్రానికి వచ్చి ప్రిన్సిపాల్ ఆదేశాలను తూ.చా. తప్పకుండా అమలు పరచవలసి ఉంటుంది. అయితే గత కొన్ని సంవత్సరాలుగా ప్రైవేటు బిఈడి కళాశాల ప్రిన్సిపాల్‌లు, యాజమాన్యాలు బయటి రాష్ట్రాలైనటువంటి తమిళనాడు, ఒరిస్సా, ఛత్తీస్గడ్, తెలంగాణ నుంచి విద్యార్థులను అడ్మిషన్ చేసుకోవడం రాష్ట్ర బిఈడి, ఎస్సిఈఆర్టి, ఎన్సిఈఆర్టి నిబంధనలు, విధివిధానాలకు పూర్తిగా వ్యతిరేకం. ప్రైవేటు బిఈడి కళాశాలలో అడ్మిషన్లను చేర్చుకునే సమయంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని విద్యార్థుల సంఖ్య కాకుండా బయట రాష్ట్రాల విద్యార్థులను పరిమిత సంఖ్యలో ప్రతి కాలేజీలో అడ్మిషన్లు చేసుకోవాల్సి ఉంటుంది. అయితే ఈ పరిమితి సంఖ్యకు మించి అడ్మిషన్లు చేసుకున్న దాఖలాలు పలు ప్రైవేటు బిఈడి



కళాశాలలో ఉన్నాయి. దీనిపై ఎస్వీయూ ఉన్నతాధికారులు ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం దారుణమని విద్యార్థి సంఘాలు ఘోషిస్తున్నాయి. ప్రస్తుతం ఆగస్టు ఒకటో తేదీ నుంచి మూడో సెమిస్టర్ విద్యార్థులకు బ్లాక్ టీచింగ్ నిర్వహించాలని ఐఏఎస్ఈ నుంచి ప్రిన్సిపల్ ఆదేశాలను జారీ చేసిన, ప్రైవేటు బీఈడీ కళాశాలలో విద్యార్థులు ఏ స్కూల్ కి కూడా శిక్షణ ఉపాధ్యాయ విద్యార్థిని పంపడం లేదని విద్యార్థి సంఘాలు ఆరోపించాయి. ప్రతి సంవత్సరం బిఈడి విద్యార్థులకు మైక్రో టీచింగ్, అబ్జర్వేషన్ టీచింగ్, బ్లాక్ టీచింగ్ వంటి ప్రత్యక్ష బోధన కార్యకలాపాలలో విద్యార్థులు పాల్గొనకుండా విద్యార్థుల నుంచి అధిక మొత్తంలో డబ్బులు వసూలు చేసి ప్రైవేటు బిఈడి కళాశాల ప్రిన్సిపాల్ లు డబ్బులు దండుకొని విద్యార్థుల చేత బ్లాక్ టీచింగ్ చేయకుండానే చేసినట్లు రికార్డులు పంపిస్తున్నారని విద్యార్థి సంఘాల నేతలు ఆరోపిస్తున్నారు. దీనిపై ప్రత్యేకమైన కమిటీని వేసి ప్రతి బీఈడీ కళాశాలకు ప్రత్యేకమైన సదుపాయాలు, క్రీడా సముదాయము, తరగతి గదుల వాతావరణము ఉన్నాయా లేదో పరిశీలించవలసిన ఆవశ్యకత ఉందని అటువంటి సదుపాయాలు లేని బిఈడి కళాశాల వెంటనే రద్దు చేయాలని విద్యార్థి సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. లేనిపక్షంలో అఖిలపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో పరిపాలన భవనాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు.

## చట్టాలపై ప్రజలకు అవగాహన కల్పించాలి

**చిల్లకూరు, మేజర్‌న్యూస్:** మండల పరిధిలోని రామారెడ్డిపాళెం గ్రామంలో పౌర హక్కుల దినోత్సవం నిర్వహించారు. శనివారం మధ్యాహ్నం నిర్వహించిన కార్యక్రమంలో తహసిల్దార్ శ్రీనివాస రావు మాట్లాడుతూ చిన్న చిన్న వివాదాలను పోలీస్ స్టేషన్లు, కోర్టుల వరకు రాకుండా గ్రామస్థాయిలో పరిష్కారం చేసుకోవాలని సూచించారు. చట్టాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఎసిడిపిఓ జ్యోతికిరణ్ మాట్లాడుతూ బాలికల హక్కుల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. ఇంకా ఈ కార్యక్రమంలో ఉపాధి హామి పథకం ఎపిఓ గిరిబాబు, సర్పంచ్, సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్, మునిశేఖర్ గ్రామస్తులు పాల్గొన్నారు.




## అసాంఘిక కార్యక్రమాలకు నిలయంగా డంపింగ్ యార్డ్

**పుంగనూరు, మేజర్‌న్యూస్:** మండలంలోని ఏటవాకిలిపంచాయతీ ఏటవాకిలి చెరువు దగ్గర డంపింగ్ యార్డ్ అసాంఘిక కార్యక్రమాలకు నిలయంగా మారుతున్నది రోజు సాయంకాలమైందంటే గుంపులు గుంపులుగా మద్యాన్ని అక్కడే తాగుతూ తింటూ తూలుతూ రోడ్డుమీద వెళ్లే ఆడవారిని, స్కూల్ పిల్లలనిఅసభ్యంగా మాట్లాడుతూ వెకిలిచేష్టలతో వారిని ఇబ్బంది పెడుతున్నారు. ఈ రోడ్డుమార్గం గుండావెళ్లాలంటేనే ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు ఈ రోడ్డు ఏటవాకిలి క్రాస్ దగ్గర నుండి అరికెల మీదుగా వెళుతుందిప్రతిరోజు కొన్ని వేల మంది ఈ రోడ్డు మార్గం గుండా వెళుతూ ఉంటారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ఈ ఆకతాయిల పైన చట్టపైన చర్యలు తీసుకోవాలని చుట్టుపక్కల గ్రామ ప్రజలు కోరుతున్నారు.



## వన వేణుగోపాల స్వామికి పాలాభిషేకం

**వెదురుకుప్పం, మేజర్‌న్యూస్:** మండలంలోని దేవర గుడిపల్లి-ఆడారెడ్డిపల్లి సమీపంలో వెలసి ఉన్న వనవేణుగోపాల స్వామికి పాలాభిషేకం జరిగింది. స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించారు. పాడి రైతులు తమ పాడి పశువుల నుండి పాలు తీసుకువచ్చి వన వేణుగోపాల స్వామికి పాలాభిషేకం చేశారు. భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. తీర్థ ప్రసాదాలు అందుకున్నారు. అక్కడే వెలసి ఉన్న శ్రీ ఆంజనేయ స్వామిని భక్తులు దర్శించుకున్నారు. కార్యనిర్వహకులు శివకుమార్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

## బీజేపీ సభ్యత్వం అవగాహనలో డాక్టర్ చంద్రప్ప

**శ్రీకాళహస్తి, మేజర్‌న్యూస్:** శ్రీకాళహస్తి పట్టణం శ్రీరాంనగర్ కాలనీ శక్తి కేంద్ర ప్రముఖ్ కండ్రిగ ఉమ ఆధ్వర్యంలో పోలింగ్ బూత్ 107, 108, 109, 110 బూత్ అధ్యక్షులు, సభ్యులతో సభ్యత్వ నమోదుపై అవగాహన కార్యక్రమం జరిగింది. 109వ బూత్‌లో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా తిరుపతి జిల్లా అధ్యక్షులు బూత్ సభ్యులు డాక్టర్ చంద్రప్ప పాల్గొన్నారు.



## సంఘ వ్యతిరేక కార్యక్రమాలకు విద్యార్థులు దూరంగా ఉండాలి

**- శ్రీకాళహస్తి పట్టణం సర్కిల్ ఇన్స్పెక్టర్ డి గోపి**

**శ్రీకాళహస్తి, మేజర్‌న్యూస్:** తిరుపతి జిల్లా ఎస్పీ యొక్క ఉత్తర్వులు మేరకు, శ్రీకాళహస్తి, సబ్ డివిజనల్ పోలీస్ ఆఫీసర్ నరసింహ మూర్తి పర్యవేక్షణలో శ్రీకాళహస్తి 1 టౌన్ సర్కిల్ ఇన్స్పెక్టర్ డి.గోపి సిబ్బంది శ్రీకాళహస్తి పట్టణం, విక్రమ్ జూనియర్ కాలేజీలో మాదకద్రవ్యాలు, ట్రాఫిక్ నియమాలు, మహిళలు పట్ల జరిగే నేరాలు సైబర్ నేరాలు గురించి అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు దూరంగా ఉండాలని. బాగా చదువుకొని తల్లిదండ్రులకు మంచి పేరు తేవాలని కోరారు. మద్యం, గంజాయి, బ్రౌన్ షుగర్ దురాలవాట్లకు దూరంగా ఉండాలని కోరారు.




## వృద్ధులకు పెన్షన్ పంపిణీ చేసిన కమిషనర్

**పలమనేరు, మేజర్‌న్యూస్:** పలమనేరు పట్టణ ప్రజలకు తెలియజేయడమేమనగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వము వారి ఆదేశాల మేరకు అన్నీ వార్డు సచివాలయ సెక్రెటరీలు ద్వారా ఇంటి ఇంటికీ పెన్షన్ పంపిణీ చేయవలెనని ఆదేశించారు. 1వతేదీ ఆదివారం సెలవు అయినందున పెన్షన్‌లు ఒకరోజు ముందుగానే 31నే ఉదయం 5 నుండి సాధ్యమైనంత త్వరగా వందశాతం ఇవ్వాలని ఆదేశించారు. కావున సెప్టెంబర్ 2024 మాసపు పెన్షన్ లబ్ధిదారులు వారికి సంబందించిన పెన్షన్ మొత్తం వారి వారి ఇంటి వద్దకే సంబధిత సచివాలయ సిబ్బంది వెళ్లి పెన్షన్ మొత్తము అందజేసియున్నారు. మొత్తము పెన్షన్లు 4640కు గాను 4446 మంది లబ్ధిదారులకు 96 శాతంతో పెన్షన్ పంపిణీ చేయడం జరిగిందని మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డి తెలిపారు.



## జనసేన ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం

**గూడూరు, మేజర్‌న్యూస్:** సెప్టెంబర్ 2న పవన్ కళ్యాణ్ జన్మదినోత్సవం పురస్కరించుకుని క్లీన్ ఆంధ్ర-గ్రీన్ ఆంధ్ర నినాదంతో నిర్వహించనున్నట్లు లీగల్ సెల్ రాష్ట్ర కార్యదర్శి, ఉమ్మడి నెల్లూరు జిల్లా ఉపాధ్యక్షులు తీగల చంద్రశేఖరరావు పేర్కొన్నారు. శనివారం ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ జన్మదిన వారోత్సవాల్లో భాగంగా కలవకొండ గ్రామంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. తీగల చంద్రశేఖర్ మాట్లాడుతూ జనసేన పార్టీ సిద్ధాంతాల్లో ఒకటైన పర్యావరణ పరిరక్షణలో భాగంగా మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టామన్నారు. పవన్‌కళ్యాణ్ పుట్టిన రోజు సందర్భంగా పలు సేవా కార్యక్రమాలను చేపడుతున్నామని అందులో భాగంగా చిల్లకూరు మండలం కలవకొండ వద్ద రక్తదాన శిబిరం ఏర్పాటు చేశామని తెలిపారు. నాయకులకు నేరేడు, వేప, రావి మొక్కలు పంపిణీ చేశారు. నాయకులు, కార్యకర్తలు మొక్కలు నాటడంతో పాటు వాటిని సంరక్షించే బాధ్యత కూడా తీసుకోవాలని కోరారు. గ్రామాల్లో మొక్కలు నాటేందుకు గూడూరు నియోజకవర్గం జనసేన పార్టీ కార్యాలయంలో ఉచితంగా మొక్కలు అందుబాటులో ఉంచామని, మొక్కలు కావలసిన జనసేన నాయకులు కార్యాలయంలో సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పిఓసి మోహన్, నాయకులు మనోజ్ కుమార్, పోలుబోయిన మురళి, గోసుల పెంచలయ్య, గోసుల సుధాకర్, సునీల్, కుందుర్తి నాగార్జున, మహేష్, కార్తీక్, ఉప్పు సాయి, పాలేటి మధు, కల్లూరు సుబ్రహ్మణ్యం, తిరుపాల్ సుమన్ రమేష్ పాల్గొన్నారు.



## 31నే పింఛన్ ఇవ్వడం దేశచరిత్రలో మొదటిసారి



**తడ, మేజర్‌న్యూస్:** దేశ చరిత్రలో ఎన్నడూ జరగని విధంగా 31వ తేదీనే అవ్వతాతలకు, వితంతువులకు వికలాంగులకు కిడ్నీ వ్యాధిగ్రస్తులకు ఒక్కరోజు ముందుగానే ముఖ్యమంత్రి నారా చంద్ర బాబు నాయుడు ఆదేశాలతో పెన్షన్ ఇవ్వడం చాలా సంతోషంగా ఉందని తడ మండల టిడిపి అధ్యక్షుడు కామిరెడ్డి మురళి రెడ్డి అన్నారు. గత ఐదు సంవత్సరాలలో వైఎస్ఆర్సిపి ప్రభుత్వంలో ఎన్నడు ఈ విధంగా పెన్షన్లు ఇచ్చే కార్యక్రమం జరగలేదని, నారా చంద్రబాబునాయుడు ఒకటవ తేదీన ఆదివారం కావడంతో ముందు రోజే శనివారం ప్రతి ఒక్క పేదవారికి పెన్షన్ల అందే విధంగా ఇంటింటికి వెళ్లి పెన్షన్ ఇవ్వాలని ఉద్దేశంతో తెలుగుదేశం పార్టీ నాయకులు పెన్షన్ దారులకు పెన్షన్ అందే కార్యక్రమాన్ని చేపట్టారు.

అందులో భాగంగా శనివారం తడ మండల పరిధిలోని తడ, చేనిగుంట గ్రామం తదితర ప్రాంతాలలో సచివాలయం సిబ్బందితో పాటు ప్రతి ఇంటికి వెళ్లి పెన్షన్లు అందించారు. పెన్షన్ల కార్యక్రమం ఉదయం 6గంటల నుంచి ప్రారం భించారు. దీంతో పెన్షన్ దారులు ఆనందం వ్యక్తం చేశారు. అందులో భాగంగా ఒకటవ తేదీ ముందు రోజు పెన్షన్ ఇవ్వడం చాలా సంతోషకరంగా ఉందని అవ్వ తాతలు, వితంతువులు, వికలాంగులు, కిడ్నీ వ్యాధిగ్రస్తులు, యాక్షన్ తీసుకుంటున్న కుటుంబ సభ్యులు అందరూ కన్నీటితో సంతోషాన్ని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు కార్యకర్తలు అభిమానులు సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

## తహసిల్దార్‌కు డప్పు కళాకారుల వినతి

**తడ, మేజర్‌న్యూస్:** తడ మండల పరిధిలో ఉన్న డప్పు (తప్పెట) కళాకారులు శనివారం తహసిల్దార్‌కు మెమోరాండం ఇచ్చారు. ఎన్నికల ముందు టిడిపి ప్రభుత్వం డప్పు (తప్పెట) కళాకారులకి రెండు ఎకరాల భూమిని ఇస్తానని హామీ ఇచ్చారని, రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీని నెరవేర్చాలని ప్రతి డప్పు కళాకారుడికి రెండు ఎకరాల భూమిని ఇవ్వాలని తహసిల్దార్‌కు మెమోరండం అందించారు. ఈకార్యక్రమంలో రాష్ట్ర డప్పు కళాకారుల కమిటీ సభ్యులు సుబ్బారావు, సిపిఎం నాయకులు చంద్రశేఖర్, సిఐటియు మండల అధ్యక్షుడు రమణయ్య, కార్యదర్శి లక్ష్మయ్య స్థానిక డప్పు కళాకారుల సంఘము అధ్యక్షులు దూడల రఘు మరియు స్థానిక నాయకులు దయాలన్, దొరవేలు, బుజ్జయ్య, సుబ్బరామయ్య, మునిక్రిష్ణయ్య తదితర కార్మికులు పాల్గొన్నారు.



## రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో స్పోర్ట్స్ క్విజ్




**గూడూరు, మేజర్‌న్యూస్:** క్రీడల్లో విద్యార్థుల్లో పోటీతత్వం మానసిక స్థైర్యం పెంపొందేందుకు దోహదపడతాయని అల్లూరు ఆదిశేషారెడ్డి రోటరీ ట్రస్ట్ ఛైర్మెన్ డాక్టర్ సి జనార్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. ధ్యాన్‌చంద్ జయంతి సందర్భంగా పట్టణ పరిధిలోని పాఠశాలల విద్యార్థులకు స్పోర్ట్స్‌పై క్విజ్ పోటీలు నిర్వహించారు. రోటరీ భవన్‌లో నిర్వహించిన క్విజ్ పోటీలలో పట్టణంలోని 16 పాఠశాలలు పాల్గొన్నడంపై సంతోషం వ్యక్తం చేశారు. క్రీడల పట్ల పాఠశాలల్లో తీసుకుంటున్న శ్రద్ధ క్విజ్ పోటీలలో పాల్గొనేందుకు పెద్ద ఎత్తున రావడం శుభ పరిణామన్నారు. ఈ క్విజ్ పోటీలో జివి శంకరయ్య మెమోరియల్ స్కూల్ విద్యార్థులు ప్రథమ బహుమతిని, సాయి విద్యానికేతన్ స్కూలు ద్వితీయ బహుమతిని, రత్నం ఇంగ్లీష్‌మీడియం స్కూల్ తృతీయ బహుమతిని గెలుచుకున్నట్లు తెలిపారు. ఆయన మాట్లాడుతూ, క్రీడలు ఆటల పట్ల అవగాహన పెంచుకునేందుకు ఎంతగానో దోహదపడుతుందని ఆయన అన్నారు. చదువుతోపాటు క్రీడలలో కూడా రాణించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ ఫాస్ట్ డిస్టిక్ గవర్నర్ కొణిదల మునిగిరీష్ మాట్లాడుతూ ఎన్నో సంవత్సరాలుగా ఈ స్పోర్ట్స్ క్విజ్‌ను నిర్వహిస్తున్నామని ఈ క్విజ్ ద్వారా విద్యార్థులలో క్రీడల గురించి తెలుసుకునే అవకాశం కలుగుతుందన్నారు. స్పోర్ట్స్ క్విజ్ నందు విజేతలకు ట్రస్ట్ ఛైర్మెన్ డాక్టర్ జనార్ధన్‌రెడ్డి చేతుల మీదుగా బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ సెక్రటరీ నాయుడు సీనియర్ రొటేరియన్లు దశరథరామిరెడ్డి, పీవీ కృష్ణయ్య మయూరి శ్యామ్, జగదీష్ నాయుడు, రాంప్రసాద్ అనిల్ కుమార్ పాల్గొన్నారు.

# దోమల నివారణకు డ్రోన్లతో మందులు పిచికారి : కమిషనర్



**తిరుపతి నగరపాలక సంస్థ, మేజర్‌న్యూస్:** తిరుపతి నగరంలో దోమల వృద్ధిని నియంత్రించడానికి, నీటి కుంటల్లో దోమ లార్వాలను నాశనం చేయడానికి డ్రోన్లతో మందును పిచికారి చేస్తున్నామని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్. మౌర్య తెలిపారు. నగరపాలక సంస్థ పరిధిలోని వినాయక సాగర్ వద్ద శనివారం డ్రోన్లతో మందును పిచికారి కార్యక్రమాన్ని కమిషనర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కమిషనర్ మౌర్య మాట్లాడుతూ నగరంలో నీటి కుంటలు, నీటి నిల్వ ప్రాంతాల్లో ఎక్కువగా దోమలు వృద్ధి చెందుతున్నాయని అన్నారు. వాటిని నివారించేందుకు మనుషులు వెళ్లలేని నీటి కుంటలు, నిల్వ నీటి ప్రాంతాల్లో డ్రోన్ల సాయంతో మందును పిచికారీ చేస్తున్నామన్నారు. నిల్వ నీటిలోని దోమ లార్వాలను నాశనం చేయడం ద్వారా దోమల పెరుగుదలను నియంత్రించ వచ్చునని అన్నారు. అధికారులు గుర్తించిన దోమల వృద్ధి ఎక్కువగా ఉన్న 32ప్రాంతాలతో పాటు మొత్తం 209 ఎకరాల్లో పైరోసిస్ ఆయిల్ ఎమల్సన్ మందును 1:4 నిష్పత్తిలో పిచికారీ చేస్తున్నామని అన్నారు. ప్రతి రోజూ 20 ఎకరాల్లో ఈ మందులు చల్లే కార్యక్రమం చేస్తామని అన్నారు. అలాగే వినాయక చవితి నిమజ్జనానికి జరుతున్న ఏర్పాట్లను ఇంజినీరింగ్ అధికారులతో కలసి కమిషనర్ పరిశీలించారు. అన్ని పనులు గడువు లోపు పూర్తి చేయాలని, భక్తులకు, ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఉండేలా ఏర్పాట్లు ఉండాలని అన్నారు. కమిషనర్ వెంట సూపరింటెండెంట్ ఇంజినీర్ మోహన్, మునిసిపల్ ఇంజినీర్ చంద్రశేఖర్, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్ రెడ్డి, సెక్రటరీ అజయ్ తదితరులు ఉన్నారు.

# హామీల అమలులో ప్రభుత్వం వెనక్కి తగ్గదు : ఎమ్మెల్యే

**గూడూరు, మేజర్‌న్యూస్:** తెలుగుదేశం పార్టీ ప్రజలకు ఇచ్చిన హామీల అమలుకు చిత్త శుద్ధితో వ్యవహరిస్తుందని ఎమ్మెల్యే డాక్టర్ పాశిం సునీల్‌కుమార్ పేర్కొన్నారు. శనివారం ఉదయం గూడూరు రెండవ పట్టణ పరిధిలోని ఇందిరానగర్‌లో పించన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ ఇంచిన హామీలను అమలు చేసేందుకు గత ప్రభుత్వం పాపాలను కడిగేందుకే ఎక్కువ సమయం పడుతుందని అయితే కనీసం సగం వరకైన ప్రక్షాళన చేయాల్సిన అవసరం ఉందన్నారు. వృద్ధులు, వితంతువులు, దివ్యాంగుల పేరుతోనూ బినామీలు, నకిలీలు వేల సంఖ్యలో ఉన్నట్లు పేర్కొన్నారు. త్వరలోనే తెలుగుదేశం పార్టీ ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలైన ఉచిత బస్సు, గ్యాస్ సిలెండర్లు,19 నుంచి 50 సంవత్సరాల మహిళల వరకు ఆర్థిక సాయం అందించడంతోపాటు మిగిలిన అన్ని హామీలను అమలు చేస్తామన్నారు. యువతకు ఉద్యోగ కల్పనకు నైపుణ్యం అందించేందుకు ప్రత్యేక శిక్షణ కేంద్రాలు ఏర్పాటు చేస్తామన్నారు. పింఛనక్ల పంపిణీ కార్యక్రమంలో తిరుపతి పార్లమెంట్ అధికార ప్రతినిధి బిల్లు చెంచురామయ్య, మైనారిటీ నాయకులు రహీమ్, ఎంపిడిఓ, సచి వాలయ సిబ్బంది, పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



# రాష్ట్రంలో పార్టీ మారిన ఎస్వీయూలో 'ఆ" అధికారిదే కీలక పాత్ర... ?

**గతంలో ఓ ముఖ్య వైసీపీ ఎమ్మెల్యే అనుచరుడుగా గుర్తింపు**

**ప్రస్తుతం టీడీపీ నేతలతో ఫోటోలు దిగుతూ సానుకూలం**

**తిరుపతి ఎడ్యుకేషన్, మేజర్‌న్యూస్:** ఎంతో పేరు ప్రఖ్యాత కలిగిన శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో గతంలో వైసీపీ ఎమ్మెల్యేకి ముఖ్యాంశుడుగా వర్సిటీలో కీలక పాత్ర పోషించి విసి, రిజిస్ట్రార్ లు చెప్పిన మాటను తూ.చా. తప్పకుండా వర్సిటీ విధి విధానాలను తొంగళ్లో తొక్కి తనకు అనుకూలమైన వారిని ఉద్యోగాలలో నియమించేందుకు సమర్థవంతంగా మామూళ్లు వసూలు చేసిన అధికారిదే నేడు ఎస్వీయూలో కీలక పాత్ర అన్నట్లుగా సాగుతుందని వర్సిటీలో ప్రచారం సాగుతోంది. గతంలో విసి రాజారెడ్డికి ముఖ్య అధికారిగా అడ్డదిడ్డమైన ఎన్.ఎం.ఆర్ పోస్టులను నియమించడంలో కీలక పాత్ర పోషించిన ఆ అధికారి నేడు కూడా తన హవాను కొనసాగిస్తుండడం విశేషం. నేడు మరొక సరికొత్త అవతారం ఎత్తి ఫేస్బుక్లో, వాట్సఅప్ లలో టిడిపి నేతలు, ఎమ్మెల్యే కొడుకులతోనూ ఫోటోలు సెల్ఫీలు దిగి పోస్టు ప్రదర్శిస్తూ టిడిపి నేతగా గుర్తింపు పొందేందుకు సాయశక్తుల కృషి చేస్తున్నట్లు తెలుస్తోంది. ఎస్వీయూలో గతంలో వైసీపీ పాలనలో కొంతమంది ముఖ్య అధికారులు వర్సిటీ వీధి, విధానాలకు అడ్డదిడ్డంగా అనేక అక్రమాలకు, అవినీతి కార్యక్రమాలకు పాల్పడ్డారని టీఎన్ఎస్ఎఫ్, తెలుగు యువత, ఎస్ఎఫ్ఐ, ఇతర అఖిలపక్ష విద్యార్థి సంఘాల నేతలు పలుమార్లు ఇన్చార్జి విసి ఆచార్య అప్పారావు, రిజిస్ట్రార్ ఆచార్య భూపతి నాయుడులకు వినతిపత్రం ఇచ్చారు.

అయితే ఎస్వీయూలో ముఖ్య అధికారి పార్టీ మారిన అధికారం మాత్రం కోల్పోకుండా ఉండేందుకు టిడిపి నేతలతో సెల్ఫీలు ఫోటోలు దిగుతూ ప్రచారం చేసుకుంటున్నట్లు సమాచారం. గతంలో ఎన్నో న్యాయబద్ధమైన ఫైల్స్‌ను దాచిపెట్టి అటు విద్యార్థులను, పరిశోధకులు, బోధనేతర సిబ్బందిని తీవ్ర ఇబ్బందులు పాలు చేశారని కొంతమంది ఎంతమంది పత్రిక ముఖంగా ఆవేదన వెల్లపుచ్చుకున్నారు. ఒక బలమైన ఓసీ వర్గానికి చెందిన అధికారి నేడు కూడా దూరవిద్య కేంద్రంలో కీలకమైన పోస్ట్ లో ఉండడం విశేషం. స్థాన చలనం జరిగిన తన బుద్ధి మాత్రం పోనిచ్చుకోకుండా మళ్ళీ కొత్త అవతారం ఎత్తి అవినీతికి దారులు వెతుక్కుంటూ ఉండటం విశేషం. ఇప్పటికే పలుమార్లు అధికారిపై విద్యార్థి సంఘాల నేతలు ఫిర్యాదు చేశారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు ఆ అధికారిపై కమిటీ వేసి, అవినీతి, అక్రమాలను బయటకు తీసి కఠినంగా శిక్షించాలని విద్యా సంఘాల నేతలు డిమాండ్ చేస్తున్నారు. లేనిపక్షంలో వర్సిటీలో పరిపాలన భవనం వద్ద నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు.

# ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలి

**- జిల్లా ప్రధాన న్యాయమూర్తి బీమా రావు**




**చిత్తూరు అర్బన్, మేజర్‌న్యూస్:** ద్విచక్ర వాహనాలపై ప్రయాణించే ప్రతి కోర్టు సిబ్బంది తప్పనిసరిగా హెల్మెట్ వాడాలని జిల్లా ప్రధానను న్యాయమూర్తి ఇ. బీమారావు పేర్కొన్నారు.శనివారం ఉదయం స్థానిక జిల్లా కోర్టు నందు జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి వెన్నెలతో కలిసి జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ ఆధ్వర్యంలో ద్విచక్రాల వాహనాల పై ప్రయాణించే కోర్టు సిబ్బంది హెల్మెట్ ధరించాలన్న అంశంపై న్యాయదికారులకు న్యాయవాదులకు కోర్టు సిబ్బందికి జిల్లా ప్రధాన న్యాయమూర్తి అధ్యక్షత హెల్మెట్ వాడకం పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి మాట్లాడుతూ ద్విచక్ర వాహనాలపై ప్రయాణించే కోర్టు సిబ్బంది తప్పనిసరిగా హెల్మెట్ వాడాలని సుప్రీంకోర్టు రాష్ట్ర హైకోర్టు ఆదేశాల మేరకు ఈ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగిందన్నారు. ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించాలన్నారు. చాలా మంది ప్రమాదాలలో ఎవరైతే హెల్మెట్ ధరించకపోవడంతో ఎక్కువ మంది ప్రమాదాల్లో మరణిస్తున్నారన్నారు. రోడ్డు ప్రమాదాలలో 90 శాతం ద్విచక్ర వాహనం నడిపే వారి వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు, కాబట్టి ఈ ప్రమాదాలు నివారించాలంటే ఈ లాంటి అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని హైకోర్టు ఆదేశించిందన్నారు. కోర్టు సిబ్బందిని ఒక్కటే కోరడం ఏమిటంటే ద్విచక్ర వాహనంపై ప్రయాణించే కోర్టు సిబ్బంది తప్పని సరిగా హెల్మెట్ ధరించాలన్నారు. ప్రమాదలలో ఎవరైతే మరణిస్తున్నారో వారి ప్రాణాలే కాకుండా కుటుంబంలో వారిపై ఆధారపడి జీవిస్తున్న వారి జీవితాలను కాపాడవలసిన బాధ్యత వారి పై ఉందన్నారు. ఒకసారి ఇంటి నుండి బయటికి వెళ్తే ఆ మనిషి తిరిగి వస్తారో రారో తెలియదని, అందువల్ల ఈ ప్రమాదాలు నివారించాలంటే ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా న్యాయ అధికారులు, న్యాయవాదులు కోర్టు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# ప్రభుత్వ భూమిలో మళ్లీ జెండా పాతిన తమిళ తంబీలు

**రెవిన్యూ శాఖ బోర్డును తొలగించిన తమిళలు**

**ఒక స్థానిక అధికార పార్టీ నాయకుడి అండతో రెచ్చిపోతున్న వైనం..?**

**కుప్పం, మేజర్‌న్యూస్:** కుప్పం కంగుంది ఆర్ఎఫ్ సర్వే నంబర్ 57లో ఉన్న 1.7 ఎకరాలు స్థలంపై తమిళలు కన్నేసిన వైనాన్ని సూర్య దినపత్రిక కళ్లకు కట్టినట్లు ఎత్తి చూపింది. దీనిపై స్పందించిన రెవెన్యూ అధికారులు సంబంధిత స్థలంలో సర్వే చేసి ప్రభుత్వ భూమిగా గుర్తించి బోర్డును ఏర్పాటు చేశారు.ఏర్పాటు చేసిన రెండు మూడు రోజులు పాటు మిన్నకుండిన కొంతమంది తమిళ తంబీలు మళ్లీ రెచ్చిపోయి బోర్డును తొలగించి యధావిదంగా ఆక్రమించుకునేందుకు ప్రయత్నిస్తున్నారు.

**తొలగించిన బోర్డు...** కంగుంది ఆర్ఎఫ్ సర్వే నంబర్ 57లో ఉన్న 1.7 ఎకరాల ప్రభుత్వ భూమిని కొంత మంది తమిళలు అక్రమంగా స్వాధీనం చేసుకున్న విషయాన్ని సూర్య దినపత్రిక ప్రచురించింది. దీనిపై స్పందించిన అధికారులు పెద్ద వంక వద్ద ఉన్న ఈ భూమికి సర్వే చేసి బోర్డులు ఏర్పాటు చేశారు.ఏర్పాటు చేసిన రెండు,మూడు రోజులు పాటు ఉన్న బోర్డును తమిళలు స్థానిక ఒక నాయకుడి..? అండతో మళ్లీ రెచ్చిపోయారు. బోర్డులను తొలగించి యధావిధిగా ఆక్రమనలకు దిగితున్నారు.ఆ స్థానిక నాయకుడి..! ముందస్తు ఒప్పందాలతో తమిళ తంబిలు మళ్లీ రెచ్చపోతున్నారు. మీ వెంట తాము ఉన్నామని.. మీరు ఎవరికి భయపడొద్దు.. మీరు భూమిని చదును చేసుకోవచ్చని..ఎవరైనా వస్తే మేము చూసుకుంటామని భరోసా ఇస్తున్నట్లు కబ్జా చేసిన అతనే చెప్తున్నాడని కొంతమంది స్థానికులు, గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. దీంతో తమిళులు యధావిధిగా ఆంధ్ర భూముల స్వాధీనంలో పడ్డారు.




**వివరణ...** దీనిపై విలేజ్ రెవిన్యూ ఆఫీషర్ బాలకృష్ణను వివరణ కోరగా బయటవారు ఆక్రమించుకుంటున్నది. ప్రభుత్వ స్థలమేనని..! ప్రభుత్వ బోర్డును తొలగించిన విషయం తమ దృష్టికి రాలేదని, పంచాయతీ అధికారులు నిధులు సమకూరిస్తే చుట్టూ ఫెన్సింగ్ వేసి ప్రభుత్వ భూమిని భద్రపరస్తామని వివరణ ఇచ్చారు. ఆ స్థలం ముమ్మాటికి ఆంధ్రులదేనని వివరణ ఇచ్చారు.



## ఉపాధ్యాయులకు ఆటలు పోటీలు ప్రారంభం

**కార్వేటినగరం, మేజర్‌న్యూస్:** కార్వేటి నగరం మండలంలో పనిచేస్తున్న ఉపాధ్యాయుని ఉపాధ్యాయులకు ఉపాధ్యాయ దినోత్సవం పురస్కరించుకొని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో క్రీడల పోటీలను మండల విద్యాశాఖ అధికారి విజయ కుమార్ మనోజ్ కుమార్ ప్రారంభించారు. సమావేశంలో ఆయన మాట్లాడుతూ క్రీడా కారులను పరిచయం చేసుకొని క్రీడలో ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘ నాయకులు క్రీడాకారులు పాల్గొన్నారు.



## పట్టణంలో ఎన్టీఆర్ పెన్షన్లు పంపిణీ

**శ్రీకాళహస్తి, మేజర్‌న్యూస్:** శ్రీకాళహస్తి పట్టణం 26వ వార్డు, 27వ వార్డు, 7 వవార్డులలో పండగ వాతావరణంలో ఐదు గంటలకు పెన్షన్లు ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమం లో పట్టణ అధ్యక్షుడు జి.విజయ్ కుమార్. మాజీ దేవస్థానం బోర్డు సభ్యులు గుర్రప్ప శెట్టి. పట్టణ యువత అధ్యక్షులు అద్దంకి హేమంత్ కుమార్ 27వ వార్డు ఇంచార్జ్ అనితమ్మ. 7వ వార్డ్ ఇంచార్జ్ శాంతమ్మ, గోవిందు, కుమార్, నింద్ర సుధాకర్, ప్రకాష్, కిరణ్, గుత్తా విజయకుమార్ నాయుడు పాల్గొన్నారు. ఒకరోజు ముందే మాకు పెన్షన్ ఇచ్చినందుకు తీసుకున్న లబ్ధిదారులు ఆనందం తో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకి శ్రీకాళహస్తి నియోజకవర్గం శాసన సభ్యులు బొజ్జల వెంకట సుధీర్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.



## ఎన్టీఆర్ భరోసా ఫించన్లు పంపిణీలో నెలవల విజయశ్రీ

**నాయుడుపేట, మేజర్‌న్యూస్:** శనివారం నాయుడుపేట మండలం మేనకూరు పంచాయతీ నందు ఎన్టీఆర్ భరోసా పెన్షన్ కార్యక్రమంలో సూళ్లూరుపేట శాసనసభ్యురాలు నెలవల విజయశ్రీ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సూళ్లూరుపేట నియోజక ఇంచార్జ్ మాజీ నెలవల సుబ్రహ్మణ్యం, మాజీ నాయుడుపేట చైర్మన్ విజయ భాస్కర్ రెడ్డి, మండల తెలుగు దేశం పార్టీ ఇంచార్జ్ అధ్యక్షులు చంద్రారెడ్డి, ఓజిలి మండల తెలుగుదేశం అధ్యక్షులు విజయ కుమార్ నాయుడు ,పెళ్లకూరు మండల ప్రధాన కార్యదర్శి నాగేంద్ర రెడ్డి, చెన్నకేశవులు పాల్గొన్నారు. వీరితోపాటు తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



## మెగా రక్తదాన శిబిరాన్ని విజయవంతం చేయండి

**పుంగనూరు, మేజర్‌న్యూస్:** సెప్టెంబర్ రెండో తేదీన పట్టణంలోని బిఎంఎస్ క్లబ్ ఆవరణం నందు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం ఆధ్వ ర్యంలో మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు సంఘం ప్రధాన కార్యదర్శి మధుబాల పేర్కొన్నారు. ఆమె మాట్లాడుతూ ఆపదలో ఉన్న వారికి అవసరమైన రక్తాన్ని అందించడం కోసం ఇందులో అభాగ్యులను కాపాడ కోవడం కోసం ఈ మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహిస్తున్నా మన్నారు. ఈ రక్తదాన శిబిరానికి అనేక మంది యువత పాల్గొని రక్తం దానం చేయాలని కోరుతున్నామన్నారు. అదేవిధంగా ఉద్యోగులు తమ వంతు సహాయంగా రక్తాన్ని అందించా లని కోరుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఉద్యోగ సంఘం అసోసియేట్ అధ్యక్షులు నాగే నాయక్ సహాయ కార్యదర్శి అక్బర్ ఆలీ తదితరులు పాల్గొన్నారు.




## ఆన్‌లైన్ ద్వారా వినాయక ఉత్సవాలకు అనుమతులు పొందాలి

### ఎస్ఐ కె.కొండప్ప నాయుడు

**తడ, మేజర్‌న్యూస్:** తడ పట్టణ, మండలంలోని గ్రామాల్లో,వీధుల్లో వినాయకచవితి ఉత్సవాలను నిర్వహించే వారి కోసం రాష్ట్ర ప్రభుత్వం సరి కొత్త ఆన్లైన్ వెబ్ సైట్ ను తీసుకు వచ్చింది. ఈ వెబ్ సైట్ ద్వారా వినాయకచవితి ఉత్సవ నిర్వాహకులు సులభంగా అనుమతులు పొందవచ్చు , అనుమతుల కోసం అధికారుల చుట్టూ తిరగకుండా ప్రభుత్వ ఈ వెసులుబాటు కల్పించిందని, గణేష్ ఉత్సవాలు నిర్వహించే వారు ఇక పై లింక్ ద్వారా వారి వివరాలను రిజిస్టర్ చేసుకొని వినాయక చవితి ఉత్సవాలను జరుపుకోవచ్చునని ఎస్సై కె. కొండప్ప నాయుడు అన్నారు. అంతే కాకుండా ఈ లింక్ ద్వారా అన్ని ప్రభుత్వ శాఖల అనుమతులు పొందడం తో పాటు మీకు అనుమతి పొందగానే ఒక క్యూ ఆర్ కోడ్ వస్తుంది ఆ క్యూ ఆర్ కోడ్ ను ప్రతి వినాయక ఉత్సవ మండపాలకు ముందు తగిలించాల్సి ఉంటుందిని ,దీని ద్వారా మీ వద్దకు వచ్చే అధికారులకు మీ అనుమతి వివరాలు తెలుస్తుందని ఎస్సై కె కొండప్ప నాయుడు తెలిపారు. కావున తడ పట్టణ , మండలంలోని అన్ని పంచాయతీలలో మరియు గ్రామాలలో వినాయక చవితి ఉత్సవాలను నిర్వహిస్తున్న ప్రతి కమిటీ సభ్యులు తప్పకుండా ప్రభుత్వ అనుమతుల తీసుకొని ఉత్సవాలను జరుపుకోవాలని దీంతోపాటు నియమ నిబంధనలు తప్పక పాటించాలని ఎస్సై కొండప్ప నాయుడు కోరారు.

## కూటమి ప్రభుత్వం ప్రభుత్వంతోనే రాష్ట్రం అభివృద్ధి

**పెద్దపంజాణి, మేజర్‌న్యూస్:** కూటమి ప్రభుత్వంతోనే రాష్ట్రమ అభి వృద్ధి చెందుతుందని పలమనేరు ఎమ్మెల్యే అమర్నాథరెడ్డి పేర్కొన్నారు. పెద్దపంజాణి మండలంలో జరుగుతున్న అభివృద్ధి పనులను పర్యవేక్షించే నిమిత్తం ఆయన మండలంలోని చలమంగళం గ్రామం లో శనివారం ఎమ్మెల్యే పర్యటించారు. ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన రెండు నెలల్లోనే అభివృద్ధి పనులను చేపట్టి కూటమి ప్రభుత్వం మేలైన పనితీరును కనబరుస్తోందన్నారు. గత తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో మాజీ మంత్రిగా పలమనేరు నియోజకవర్గంలోని ఐదు మండలాలలో పూర్తిస్థాయి రోడ్ల నిర్మాణా నికి ఈఏపీ (ఎక్స్టర్నల్ ఎయిడెడ్ ప్రాజెక్ట్) ద్వారా 147.77 కోట్లను మంజూరు చేయించానన్నారు. అయితే 2019 ఎన్నికల్లో వైకాపా ప్రభుత్వం అధికారం చేపట్టాక ఆ పనులను గత పాలకులు తుంగలో తొక్కారన్నారు. ఎన్నికల ప్రచార సమయంలో మంజూరైన పనులను వైకాపా నేతలు అభివృద్ధి చేయక తనపైనిందలు వేస్తున్నారని ప్రజలకు వివరించడంతో పాటు తాను గెలిచిన వెంటనే పనులు పూర్తి చేయిస్తా నని హామీ ఇచ్చానని హామీలో భాగంగా పెద్దపంజాణి మండలంలోని చలమంగళం పంచాయతీ పరిధిలో రూ.2.22 కోట్లతో 4.20 కి.మీ మేర జరుగుతున్న రోడ్డు పనులను ఆయన శనివారం పర్యవేక్షించా రు. ముద్దేపల్లి, ఎగువ ముద్దేపల్లి, దిగువ ముద్దేపల్లి కొత్తూరు, సులేరు గుట్ట గ్రామాలలో జరిగిన రోడ్లను పరిశీలించారు. ముద్దేపల్లిలో గ్రామ స్తులతో ఆయన ముఖాముఖి నిర్వహించారు. ఎన్నికల ప్రచారంలో



ఇచ్చిన హామీ మేరకు అభివృద్ధి పనులను చేపడుతున్నామని, గత పాలకులు తనపై చేసిన దుష్ప్రచారంపై ఇప్పటికైనా ప్రజలు గ్రహిం చాలన్నారు. గ్రామస్తులు ఎమ్మెల్యే అమర్నాథ్ రెడ్డిని ఘనంగా సన్మానించి తమ అభిమానాన్ని చాటుకున్నారు.

**సామాజిక పింఛన్లు పంపిణీ...** ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతు న్న సామాజిక పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో స్థానిక శాసన సభ్యులు అమర్నాథ్ రెడ్డి శనివారం పాల్గొన్నారు. చలమంగళం పంచాయతీలో ని ముద్దేపల్లి, వడ్డూరు,సులేరుగుట్ట గ్రామాల్లో ఆయన పింఛన్లను అందచేశారు. ఈ కార్యక్ర మాలలో మాజీ ఎంపీపీ విజయభాస్కర్ రెడ్డి, తెలుగుదేశం పార్టీ నాయకులు ఆనంద్, చలపతి, సుధాకర్ రెడ్డి, మురహరి రెడ్డి, రోజారెడ్డి, శ్రీరాములు, భాను ప్రతాప్ రెడ్డి, నాగిరెడ్డి,భాస్కర్, భావాజాన్, ఎంపీడీవో అబ్దుల్ రహీం, పంచాయతీ సెక్రటరీ శశికళ, ఏపీఎం కృష్ణప్ప, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## డిప్యూటీ సీఎం జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహిద్దాం

**పుంగనూరు, మేజర్‌న్యూస్:** పట్టణంలో జనసేన పార్టీ నేతలు శనివారం రోజున మీడియా సమావేశం నిర్వహించారు ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి పగడాల రమణ మాట్లాడుతూ వచ్చేనెల రెండవ తేదీన రాష్ట్ర డిప్యూటీ సీఎం జనసేన పార్టీ జాతీయ



అధ్యక్షులు కొణిదల పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలను పట్టణ మరియు మండల పరిధిలో మొదటగా గోకుల్ సర్కిల్ నందు కేక్ కట్ చేసి అన్నదాన కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు అదేవిధంగా భీమ్‌గాని పల్లి సర్కిల్ ఎంసిపల్లి సర్కుల్ కుదవ పల్లి క్రాస్ సుగాలిమిట్ట సర్కిల్ పాలెంపల్లి సర్కిల్ సింగర్‌గుంట సర్కిల్ మాగండ పల్లి ప్రాంతాల్లో పార్టీ నాయకులు కార్యకర్తలు అభిమానుల సమక్షం లో కేకులు కట్ చేయడంతో పాటు అన్నదాన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు విరుపాక్షి జిల్లా ప్రోగ్రామ్ సెక్రెటరీ చైతన్య రాయల్ రూరల్ ప్రధాన కార్యదర్శి హరినాయక్ నాయకులు వెంకటేష్ శ్రీరాములు శ్రీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

## ఎన్టీఆర్ భరోసా పెన్షన్‌ను పంపిణీ

**గంగాధర నెల్లూరు, మేజర్‌న్యూస్:** గంగాధర నెల్లూరు మండలం నెల్లెపల్లి పంచాయతీ నెల్లేపల్లి గ్రామంలో ఎన్టీఆర్ భరోసా పెన్షన్‌లను శనివారం జిల్లా యాదవ సాధికార సమితి అధ్యక్షులు శ్రీధర్ యాదవ్ పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ పెన్షన్ ముందస్తు పంపిణీ చేయడంలో ఏపీ ప్రభుత్వం సీఎం చంద్రబాబు నాయుడుకే సాధ్యమని అన్నారు. సెప్టెంబర్ నెల ఒకటవ తేదీ ఆదివారం కావడంతో ముంద స్తుగా పింఛన్ పంపిణీ చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది నేడు ఒకే నెలలో రెండుసార్లు పెన్షన్ ఇంటి వద్దకే పంపిణీ చేసిన ఘనత టిడిపి ప్రభుత్వానికి దక్కుతుందని అన్నారు. వాలంటీర్లు లేకుండానే పెన్షన్ లబ్ధిదారులకు ఇంటి వద్దకే వెళ్లి పెన్షన్ ఇవ్వడంతో వారి సంతోషానికి అవధులు లేకుండా పోయిందన్నారు. అదేవిధంగా రోజుల్లో రాష్ట్రం అభివృద్ధి బాటలో నడిపి రాష్ట్రం రాష్ట్ర ప్రజలు సస్యశ్యామలంగా ఉంటుందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, సారధ్యంలో రాష్ట్రం మరింత ముందుకు వెళ్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ కమిటీ అధ్యక్షులు వెంకటేశ్ యాదవ్, పంచాయతీ కార్యదర్శి రవీంద్రబాబు, వీఆర్వో జయ కుమార్, ఇంజనీరింగ్ అసిస్టెంట్ సునీల్, డిజిటల్ అసిస్టెంట్ చిన్నబ్బ రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.



## నాపై వచ్చిన తప్పుడు ఆరోపణలు నమ్మకండి

### - చంద్రగిరి ఎమ్మెల్యే నానిని అభ్యర్థించిన రైతు రాము

**తిరుపతి ప్రెస్‌క్లబ్, మేజర్ న్యూస్:** చంద్రగిరి కోటలో నివాసముంటూ 150 బైపాస్ లో సర్వేనెంబర్ 312, 313లో ఒక ఎకరా 18. 3/4 సెంటు భూమి కలిగిన తనపై లేనిపోని ఆరోపణలను ఎమ్మెల్యే నానికి ముడిపెట్టి చేసిన తప్పుడు ప్రచారాలను చంద్రగిరి శాసనసభ్యులు పులివర్తి నాని నమ్మకూడదని..రైతు సింగంశెట్టి రాము పులివర్తి నానిని మీడియా ద్వారా వేడుకున్నారు. తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో శనివారం మీడియా ముందు ఉమా మహేష్,రెడ్డి శేఖర్‌తో కలిసి రాము మాట్లాడుతూ ఎవరో కావాలనే తనకు, ఎమ్మెల్యే నానికి మధ్య చిచ్చు పెట్టాలని చూసారని ఆవేదన వ్యక్తం చేశారు.తన కుటుంబ సభ్యులంతా ఈ ఆరోపణలను జీర్ణించు కోలేక ఆవేదనకు గురవు తున్నారని తెలియజేశారు. ఈ విషయంపై ఎమ్మెల్యే నాని స్పందించి విష ప్రచా రాన్ని నమ్మవద్దన్నారు.



## మండలంలో 95,85 పింఛన్లు పంపిణీ

**కార్వేటినగరం, మేజర్‌న్యూస్:** మండలంలో ఎన్టీఆర్ భరోసా పింఛన్లు పంపిణీలో 95.85% పంపిణీ చేసినట్లు ఇంచార్జి ఎంపీడీవో లక్ష్మీపతి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో మొత్తం పింఛన్లు 7087, దాంట్లో 6893 మందికి పింఛన్లు పంపిణీ చేశారు. నిలిచిపోయిన వారికి సోమవారం పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మండల స్థాయి అధికారులు సచివాలయ సిబ్బంది తెలుగు దేశం పార్టీ నాయకులు బిజెపి నాయకులు జనసేన పార్టీ నాయకులు పాల్గొన్నారు.



## సహాయ కమిషనర్‌గా ప్రసాద్ బాధ్యతలు స్వీకరణ

**చిత్తూరు కార్పొరేషన్, మేజర్‌న్యూస్:** చిత్తూరు నగర పాలక సంస్థ సహాయ కమిషనర్ గా అవినేని ప్రసాద్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. నెల్లూరు నగర పాలక సంస్థ టౌన్ ప్రాజెక్టు ఆఫీసర్‌గా విధులు నిర్వహిస్తూ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన బదిలీల్లో భాగంగా చిత్తూరు నగరపాలక సంస్థ సహాయ కమిషనర్‌గా నియమితులయ్యారు. సహాయ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన అవినేని ప్రసాద్‌కు నగరపాలక అధికారులు పుష్పగుచ్చాలు అందించి అభినందనలు తెలిపారు.



## బీజేపీ సభ్యత్వ నమోదుకు ఆదరణ

**వెదురుకుప్పం, మేజర్‌న్యూస్:** మండలంలో బిజెపి సభ్యత్వ నమోదుకు మంచి ఆదరణ లభిస్తోందని జిల్లా బిజెపి ఎస్సీ మోర్చా ప్రధాన కార్యదర్శి పాముల శేషాద్రికుమార్ అన్నారు. శనివారం మండలంలోని బొమ్మేపల్లి పంచాయతీలో బిజెపి సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు. బిజెపి సదా సత్య అభినయ్ 2024 కార్యక్రమం లో భాగంగా రాష్ట్ర బిజెపి పార్టీ ఆదేశాల మేరకు సభ్యత నమోదు కార్యక్రమాన్ని విస్తృతం చేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు. దేవలం పెట 78 గ్రామంలో బూత్ కమిటీ ప్రముఖులతో చర్చించామన్నారు. కార్యక్రమంలో బూత్ అధ్యక్షులు మునస్వామి, రోశయ్య, రాములయ్య, ప్రకాష్, మోహన్, అన్నయ్యలు పాల్గొన్నారు.



## ముందస్తు పింఛన్ల పంపిణీ పండుగ

**కుప్పం, మేజర్‌న్యూస్:** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పంపిణీ కార్యక్రమంలో భాగంగా శనివారం కుప్పం మండలం గుడ్లనాయనపల్లి పంచాయతీ ఊరినాయనపల్లిలో అంగన వాడి కేంద్రం వద్ద లబ్ధిదారులకి పండగ వాతావరణంలో ఒక్కరోజు ముందుగానే ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణి కుప్పం నియోజకవర్గ ఇంచార్జ్ పిఎస్ మునిరత్నం అందజేసారు. మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు ఆదివారం సెలవు కావడంతో ఒక్క రోజు ముందుగానే సామాజిక పింఛన్ల పంపిణీ చేపట్టాలని బృహత్తర కార్యక్రమం చేపట్టి లబ్ధిదారులకు బాసటగా నిలిచారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎక్స్ ఎంపీపీ డాక్టర్ వెంకటేష్, క్లస్టర్ ఇంచార్జ్ మహేంద్ర, పంచాయతీ పార్టీ అధ్యక్షులు బాలాజీ మరియు తెలుగుదేశం పార్టీ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



## ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ

**వెదురుకుప్పం, మేజర్‌న్యూస్:** కూటమి ప్రభుత్వం పెంచిన ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని వెదురుకుప్పం మండలంలో శనివారం పంపిణీ చేశారు. సెప్టెంబరు ఒకటిన పంపిణీ చేయవలసిన పింఛన్లను ఆగస్టు 31న పంపిణీ చేశారు. మండలంలో ఒక్క రోజే సుమారు 96 శాతం పింఛన్లను పంపిణీ చేశారు. పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో వెదురుకుప్పం ఇన్చార్జి ఎంపీడీవో హరిబాబు నాయుడు, క్లస్టర్ ఇంచార్జ్ మోహన మురళి, రాష్ట్ర తెలుగుదేశం పార్టీ సాంస్కృతి విభాగం ప్రధాన కార్యదర్శి ముని చంద్రారెడ్డి, గంటవారిపల్లి తెలుగుదేశం పార్టీ యువ నాయకుడు బండి విష్ణువర్ధన్ రెడ్డి పోటుగారి గంగయ్యలు పింఛన్లను పంపిణీ చేశారు.



## ఒక రోజు ముందే అవ్వాతాతలకు ఎన్టీఆర్ భరోసా పెన్షన్

**- టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి కోదండ యాదవ్**

**చిత్తూరు అర్బన్, మేజర్‌న్యూస్:** ఒకరోజు ముందే సెప్టెంబర్ మాసానికి చెందిన ఎన్టీఆర్ భరోసా పెన్షన్ ను లబ్దిదారులకు అందజేయడం జరిగిందని టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి కోదండ యాదవ్ తెలిపారు. ఇందులో భాగంగా తమ స్వగ్రామం తుంబ పాల్యం లో సచివాలయ సిబ్బందితో కలిసి లబ్ధిదారులకు ఎన్టీఆర్ భరోసా పెన్షన్ ను అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి కోదండ యాదవ్ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రాష్ట్రవ్యాప్తంగా అవ్వ తాతలకు,వికలాంగులకు, వితంతువులకు, బెడ్ రెడెన్ పేషెంట్లకు ఎన్టీఆర్ భరోసా సామాజిక పెన్షన్లను ఒకటవ తారీఖున ఆదివారం సెలవు రోజుగా ఉన్నందున ఒక్కరోజు ముందే ఈనెల 31 వ తారీకు శనివారం రోజున గ్రామ పంచాయతీ, సచివాలయ అధికారులు, ప్రభుత్వ సిబ్బందికి ఆదేశాలు జారీ చేసి లబ్ధిదారులకు పెన్షన్లు పంపిణీ చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక తెలుగు దేశం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## గోవిందరాజుస్వామి ఆలయంలో వనభోజనాలు

**పెద్దపంజాణి, మేజర్‌న్యూస్:** మండలంలోని గ్రామాలలోని ఆలయాలలో శ్రావణ శనివారం చివరి రోజు ప్రత్యేక పూజలు నిర్వహించారు. చలమంగళం గ్రామపంచాయతీ ముద్దేపల్లి గ్రామ సమీపంలో వెలసిన గోవిందరాజస్వామి ఆలయంలో ప్రతి ఏటా ఉత్సవాలు నిర్వహించడం ఆనవాయితీ. ఈ నేపథ్యంలో శనివారం ఉదయం నుండి స్వామి వారికి అభిషేకాలు, అర్చనలు నిర్వహించడంతో పాటు ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారిని వివిధ రకాల పుష్పాలతో ప్రత్యేక అలంకరణ చేశారు.ముద్దేపల్లి, ఎగువ ముద్దేపల్లి, గుడ్డూరు తదితర గ్రామాల్లో దేవర ఎద్దుకు గ్రామ పూజలు నిర్వహించారు. సమీప గ్రామాల్లో ఆలయాలు ఇండ్లలో పూజలు పూర్తి అయ్యాక ఆలయం వద్ద ప్రజలకు వనభోజనం సిద్ధం చేయడం పరిపాటి దేవర ఎద్దును ఆలయం వద్దకు తీసుకు వచ్చి మొదట ఎద్దు కు భోజనం వడ్డించి అది తిన్న వెంటనే భక్తులకు వడ్డిస్తారు. ఇలా చేయడంతో సమీప గ్రామాల్లో ఎలాంటి ఇబ్బందులు ఎదురవ్వవని ప్రజలు నమ్మకం. పలమనేరు ఎమ్మెల్యే అమరనాథరెడ్డి స్వామి వారిని దర్శించుకుని, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఆయనతో పాటు మాజీ ఎంపీపీ విజయభాస్కర్ రెడ్డి, పలువురు నాయకులు పాల్గొన్నారు.



## దేశం కోసం.. ధర్మం కోసం బీజేపీ సభ్యత్వ నమోదుచేసుకోండి

**చౌడేపల్లి, మేజర్‌న్యూస్:** మండలంలో భారతీయ జనతా పార్టీని బలోపేతం దిశగా ముందుకు వెళ్తున్నామని కిసాన్ మోర్చా రాయలసీమ జోనల్ ఇంచార్జ్ ఓసూరు కిరణ్ తెల్పారు. ఆయన మాట్లాడుతూ సెప్టెంబర్ 2న మన ప్రధానమంత్రి నరేంద్రమోడీ మొదటగా ఆన్‌లైన్లో తమ సభ్యత్వాన్ని నమోదుచేసుకుంటారని, అప్పటి నుండి చౌడేపల్లి మండలం లోగల 19 గ్రామపంచాయతీలలో బి.జే.పి పార్టి సభ్యత్వ నమోదు ప్రక్రియ ప్రారంభిస్తామని, సభ్యులుగా చేరదలచిన వారు 8800002024 అనే నెంబర్ కు మిస్సిడ్ కాల్ ఇచ్చి దేశం కోసం- దర్మం కోసం సభ్యత్వాన్ని తీసుకోవాలని కోరడం జరిగింది.ప్రస్తుతం కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలలో భాగం పంచుకోవాలని,మన వంతుగా మన గ్రామ, మండల, నియోజక వర్గాలను అభివృద్ధి దిశగా ముందుకు తీసుకొని వెళ్ళాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ మండలాధ్యక్షులు కడియాల మనోహర్,కిసాన్ మోర్చా బనానా సెల్ కన్వీనర్ విజయ్ కుమార్, జిల్లా యువ కిసాన్ మోర్చా ఐటి సెల్ కన్వీనర్ గంధోడి ప్రవీణ్, రెడ్డెప్ప, శేఖర్, తదితరులు పాల్గొన్నారు.



## కుప్పం నర్సింగ్ కళాశాలలో ఘనంగా గ్రాడ్యుయేషన్ డే

**కుప్పం, మేజర్‌న్యూస్:** కుప్పం నర్సింగ్ కళాశాలలో నర్సింగ్ కోర్సును పూర్తిచేసుకొన్న విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమంను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా డాక్టర్ కె.రాము డీన్, ఆర్ ఆర్ కాలేజీ ఆఫ్ నర్సింగ్, బెంగళూరు.పాల్గొని నర్సింగ్ విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ పట్టాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నర్సింగ్ సిబ్బంది అందించే సేవలు అత్యంత అమూల్యమైనవని, రోగులు ప్రాణాలు నిలబెట్టడానికి వారు చేసే కృషి వెలకట్టలేమని తెలిపారు.తదనంతరం కళాశాల ఛైర్మన్ బి.సి నాగరాజ్ మాట్లాడుతూ నర్సులు వృత్తి పట్ల కర్తవ్యంతో రోగుల సమస్యలను ఓపికగా తెలుసుకొని, సున్నిత మనస్తత్వంతో, ప్రమానురాగలతో తమ సేవలను అందించాలని చిన్నప్పటి నుండీ అన్ని విధాలా తమ ఉన్నతికి పాటుపడిన తల్లితండ్రుల గౌరవాన్ని కాపాడే స్థాయికి ఎదగాలన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ఛైర్మన్ డాక్టర్ సునీల్ రాజ్, ఛైర్ పర్సన్ శాంత నాగరాజ్, సీఈఓ సాగర్ రాజ్, ప్రిన్సిపాల్ విమల మరియు విద్యార్థులు అధ్యాపకులు పాల్గొన్నారు.



## భక్తజన సంద్రంగా నరసింహాస్వామి కొండ

**చౌడేపల్లి, మేజర్‌న్యూస్:** మండలంలో వెలసి ఉన్న శ్రీలక్ష్మినరసింహాస్వామి కొండ కు పోటెత్తిన భక్తులు.శ్రావణ మాసం చివరి శనివారం సందర్భంగా నాలుగు వారాలు భక్తి శ్రద్దలతో పూజలు చేసుకొని నాల్గవవారం మండలంలో వెంగళపల్లి గ్రామపంచాయతీ, దాసరయ్య గారి పల్లి సమీపం లో రాజనాల బండప్రక్కనే గల అత్యంత ఎతైన కొండపై వెలసిన శ్రీ లక్ష్మి నరసింహాస్వామి కొండకు వెళ్ళి మొక్కులు తీర్చుకుంటారు.ఐతే ఈ కొండ అన్నికొండల పైకి గోవుపాదం అంత ఎత్తులో ఉంటుందని పెద్దలు చెప్తుంటారు.ఈ కొండపై నీడ తిరగని చింతచెట్లు ఉండటం విశేషం.అది ఎలాగంటే ఉదయం పూట ఎక్కడైతే చింతచెట్టు నీడ ఉంటుందో సాయంత్రం కూడా నీడ అక్కడే ఉంటుంది.అంతే కాకుండా స్వామి వారికి కొండపైన చిన్న ఆలయం ఉంది.అక్కడే అంత ఎత్తులో చిన్నపాటి కోనేరు కలదు.సదరు కోనేటి లో ఎల్లప్పుడూ నీటి జాడ ఉంటుందని,మేకలు కొండకు మేతకు వెళ్తే అక్కడే నీరుతాగుతాయని అక్కడి స్థానికులు చెప్తుంటారు.అంతే కాకుండా సాయంత్రం కొండపైన భక్తులు సమర్పించిన నెయ్యితో అఖండజ్యోతి వెలిగిస్తారు.ఈ జ్యోతి దాదాపు మూడు,నాలుగు మండలాల ప్రజలు అఖండ జ్యోతి దర్శనం అనంతరం ఉపవాస దీక్షను ముగిస్తారు. శనివారం సాయంత్రం లక్ష్మి నరసింహాస్వామి, శ్రీవీరాంజనేయుల ఉత్సవ విగ్రహాలను మెరువుని కార్యక్రమం నిర్వహిస్తారు.స్థానిక ప్రజలు అక్కడక్కడా భక్తుళకు అన్నదానం నిర్వహిస్తుంటారు.ఈ ఏడునుండి దేవస్థానం తిరుపతి తిరుమల దేవస్థానం ఆధీనం లోకి వెళ్ళడం జరిగింది. దీంతో అడుగడుగునా సెక్యూరిటీ,దేవాలయ దర్శనం కూడా తొందర చేస్తున్నారు.ఆదివారం శ్రీ వీరాంజనేయ స్వామివారి తిరునాళ్ల , ఉట్లోత్సవం జరుగును.



# జాబ్ మేళాలను నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోండి

## చిత్తూరు జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్

**చిత్తూరు కలెక్టరేట్, మేజర్‌న్యూస్:** జాబ్ మేళాను నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని చిత్తూరు జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ తెలిపారు. రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఎంప్లాయిమెంట్ ఎక్స్చేంజ్, సీడప్ డి.ఆర్.డి.ఎ సంయుక్తంగా సెప్టెంబర్ నెల 03వ తేదిన మంగళవారం స్థానిక ప్రభుత్వ ఐ టి ఐ చిత్తూరు కళాశాలలో మరియు ఎస్ వి సిఆర్ ప్రభుత్వ డిగ్రీ పలమనేరు కళాశాలలో నందు నిర్వహించే జాబ్ మేళాలని ఉద్యోగ అర్హత కలిగిన యువతీ యువకులు సద్వినియోగం చేసుకోవాలని చిత్తూరు జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ పిలుపునిచ్చారు. ఈ జాబ్ మేళాలకు సంబందించిన గోడ ప్రతులను శనివారం ఉదయం చిత్తూరు జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్ ఐఎఎస్ జిల్లా జాయింట్ కలెక్టర్ గొబ్బిళ్ల విద్యాధరి కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా చిత్తూరు జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్, మాట్లాడుతూ ఈ అవకాశాన్ని జిల్లాలోని అన్ని పంచాయితీ వార్డ్ సచివాలయాలోని పరిధిలో ఉన్న ఉద్యోగార్థులను గుర్తించి వారికీ సమాచారం చేరవేయాలని కోరారు. అదేవిధంగా ఇందులో దాదాపు 10 కంపెనీలు విచ్చేయుచున్నాయి తెలిపారు.

కనీస విద్యార్హత 10వ తరగతి నుండి డిగ్రీ ఫెయిల్, పాస్ అయిన 18 సం" నుండి 35 సం" మధ్య వయస్సు కలిగిన స్త్రీ పురుష అభ్యర్థులు హాజరు కావచ్చునని తెలిపారు. ఈ ఆవిష్కరణ కార్యక్రమంలో జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి యన్. గుణశేఖర్ రెడ్డి , జిల్లా ఉపాది అధికారి పద్మజ , అదనపు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి యం. ఏకాంబరం, జిల్లా ప్లేసేమెంట్ అధికారి చైతన్య డి.ఆర్.డి.ఎ ఎ పి యం సెల్వ రాజన్ పాల్గొన్నారు. సంప్రదించవలసిన ఫోన్ నంబర్లు: చిత్తూరు రూపేష్- 9160940479, లోకేష్ 9963561755, పలమనేరు సిసింద్రీ- 8465830771, వినోద్ 7672096930.



# స్వచ్ సర్వేక్షన్‌లో తిరుపతిని ప్రథమ స్థానంలో నిలుపుదాం

## సెప్టెంబర్ 14 నుండి స్వచ్ఛత హి సేవ కార్యక్రమాలు... కమిషనర్



**తిరుపతి నగరపాలక సంస్థ, మేజర్‌న్యూస్:** దేశంలో ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహించే స్వచ్ సర్వేక్షన్ పోటీల్లో మన తిరుపతిని ప్రథమ స్థానంలో నిలిపెందుకు అందరూ సహకరించాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య ప్రజలకు, అధికారులకు పిలుపునిచ్చారు. శనివారం నగరపాలక సంస్థ కార్యాలయంలో స్వచ్ సర్వేక్షన్ పోటీలపై వివిధ విభాగాల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. కమిషనర్ మాట్లాడుతూ నగరపాలక సంస్థ లో వందశాతం ఇంటింటి చెత్త సేకరణ జరుగుతున్నదని అన్నారు. అయితే ప్రజలు నగరంలో అక్కడక్కడా చెత్త కుప్పలుగా పడేయకుండా మీ ఇంటికి వస్తున్న మా వారికి తడి, పొడి చెత్త వేర్వేరుగా ఇవ్వాలని ప్రజలని కోరారు. తడి, పొడి చెత్తపై ప్రజల్లో అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. నగరంలో ఎక్కడా భావన నిర్మాణ వ్యర్థాలు వేయకుండా చర్యలు తెయనుకోవాలని అన్నారు. సెప్టెంబర్ 14 నుండి 15 రోజుల పాటు స్వచ్ఛత హి సేవ కార్యక్రమం నిర్వహిస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా ప్రతిజ్ఞలు, నగరంలో ప్రత్యేకంగా పరిశుభ్రత కార్యక్రమాలు, సపాయి మిత్రలకు ఆరోగ్య పరీక్షలు, తదితర కార్యక్రమాలు నిర్వహిస్తామని అన్నారు. స్వచ్ సర్వేక్షన్లో తిరుపతి ని ప్రథమ స్థానంలో నిలిపెందుకు అందరు సహకరించాలని కోరారు.

# అక్రమ లేఅవుట్‌లో ప్లాట్లు రిజిస్ట్రేషన్ ఆపాలి: కమిషనర్

**పుంగనూరు, మేజర్‌న్యూస్:** పట్టణంలో రియల్ ఎస్టేట్ వ్యాపారులు మున్సిపల్ అనుమతులు లేకుండా 17 అక్రమ లేఔట్ లు వేశారని వాటిలో ఎలాంటి క్రయవిక్రయాలు జరపరాదని మున్సిపల్ కమిషనర్ నరసింహ ప్రసాద్ రెడ్డి గత వారం ముందట హెచ్చరించడం జరిగింది. అయినప్పటికీ పట్టణంలోని కుమ్మర వీధి వినాయక గుడి వెనకాల ఉన్న 161లో 1 సర్వేనెంబర్ 161లో 5 సర్వే నెంబర్లో ఇది అక్రమ లేఔట్ అని తెలిపినప్పటికీ గత రెండు రోజులుగా ప్లాట్లు విక్రయిస్తూ రిజిస్టర్లు చేస్తున్నారని సమాచారం రావడంతో వెంటనే ఆపాలని హెచ్చరించడం జరిగింది ప్రజలు సైతం అప్రమత్తంగా ఉండి మోసపోకూడదని కోరుతున్నామని కమిషనర్ పేర్కొన్నారు మొండి వైఖరితో ముందుకు వెళితే మున్సిపల్ నిబంధనల మేరకు చర్యలు చేపడతామన్నారు రిజిస్టర్ శాఖ అధికారులు అక్రమా లేఔట్ల కు సంబంధించిన వివరాలను మీకు పంపడం జరుగుతుందని ఆ లేఅవుట్లలో ప్లాట్లు రిజిస్టర్ చేయరాదని కోరుతున్నామన్నారు.



# ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణి



**చిత్తూరు అర్బన్, మేజర్‌న్యూస్:** చిత్తూరు నియోజకవర్గ ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ ఆధ్వర్యంలో ముందస్తు ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణి పండుగ కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో భాగంగా శనివారం చిత్తూరు నగరంలోని 47వ డివిజన్ నందు స్థానిక లెనిన్ నగర్, గంగమ్మ గుడి మండపం వద్ద లబ్ధిదారులకి పండగ వాతావరణంలో ఒక్కరోజు ముందుగానే ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణి కార్యక్రమం ఆ డివిజన్ టిడిపి ఇన్చార్జ్ ఉదయ్ కుమార్ ఆధ్వర్యంలో చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ పెన్షన్లను పంపిణీ చేశారు. ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు సెప్టెంబర్ 1వ తేదీన ఆదివారం సెలవు కావడంతో ఒక్క రోజు ముందుగానే సామాజిక పింఛన్ల పంపిణీ చేపట్టాలని బృహత్తర కార్యక్రమం చేపట్టి లబ్ధిదారులకు బాసటగా నిలిచారని పేర్కొన్నారు. 47వ వార్డులో డంప్ యార్డును యుద్ధ ప్రాతిపదికన శుద్ధి చేయించిన నగర పాలక కమిషనర్ జె. అరుణ స్ఫూర్తిగా ప్రతి ఉద్యోగి పని చేసి చిత్తూరు నియోజకవర్గ అభివృద్ధికి తోడ్పడాలని అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో చిత్తూరు నియోజకర్గ తెలుగుదేశం పార్టీ సమన్వయకర్తలు మారుతి, పల్లెంటి సునీల్ కుమార్, మాజీ మేయర్ కఠారి హేమలత, మేయర్ అముద, డిప్యూటీ మేయర్ రాజేష్ కుమార్ రెడ్డి, నగర పాలక అధికారులు, ఉమ్మడి పార్టీల నాయకులు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

# చంద్రబాబు కలకాలం సుఖంగా జీవించాలి

## పెన్షన్ల పంపిణీలో ఎమ్మెల్యే సేవలు అమోఘం

**చిత్తూరు, మేజర్‌న్యూస్:** వృద్ధులు, వితంతువులు వికలాంగులు ఇతర పెన్షన్ లబ్ధిదారుల కండ్లలో ఆనందాన్ని నింపేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి అందిస్తున్న 4000 రూపాయల పెన్షన్ తీసుకుంటున్న ప్రతి లబ్ధిదారులు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కలకాలం సుఖంగా జీవించాలని ఆశీర్వదిస్తూ వారి ఆనందాన్ని తెలియజేస్తు న్నారు. రాష్ట్ర వ్యాప్తంగా గతంలో ఎన్నడూ ఏ ముఖ్యమంత్రి చేయనటువంటి అభివృద్ధి కార్యక్రమాలను చేయడమే కాకుండా ఎన్నికల మేనిఫెస్టోలో ఉమ్మడి పార్టీల ఆధ్వర్యంలో ఇచ్చిన హామీ మేరకు 4 వేల రూపాయల పెన్షన్ అనుకున్న తేదీ కన్నా ముందుగా అందిస్తున్నారు. నేపథ్యంలో చిత్తూరు శాసనసభ్యులకు గురజాల జగన్మోహన్ ఆదేశాల మేరకు చిత్తూరు నగరపాలక సంస్థ పరిధిలోని 32 వ డివిజన్ నందు డివిజన్ టిడిపి నాయకురాలు హేమావతి అలాగే వార్డు అడ్మిన్ సెక్రటరీ కిషోర్ కార్యాలయ ఇతర కార్యదర్శులు షాహినూర్, మోహన్, హారిక తదితరులు ఆధ్వర్యంలో ఉదయం రెండు గంటల నుండి నాలుగు వేల రూపాయల పెన్షన్ అందించారు. లబ్ధిదారులు గతంలో ఎప్పుడూ ఏ ముఖ్యమంత్రి ఇంటి వద్దకు వచ్చి నిద్రలేపి లక్ష్మీదేవిని చేతిలో ఇవ్వడం జరగలేదని కార్యాలు చుట్టూ తిప్పించుకుని నానా ఇబ్బందులకు గురి చేసే వారిని అయితే



ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రస్తుత అందిస్తున్న పెన్షన్ విధానం చాలా ఆనందాన్ని కలిగిస్తోందని లబ్ధిదారులు పేర్కొనడం జరిగిందని టిడిపి నాయకురాలు హేమావతి, వార్డు షష్ఠిఅడ్మిన్ సెక్రటరీ కిషోర్ లు తెలిపారు. అలాగే చిత్తూరు నియోజకవర్గంలో నియోజకవర్గ శాసనసభ్యులు గురజాల జగన్మోహన్ ఆదేశాల మేరకు ఏ ఒక్క లబ్ధిదారులను విడవకుండా ఉదయం నుండి పెన్షన్ పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టడం జరిగిందన్నారు ఇప్పటి వరకు 32 వ డివిజన్ పరిధిలో 93% వరకు పెన్షన్ పంపిణీ పూర్తి చేశామని అన్నారు అలాగే చిత్తూరు నగరపాలక సంఘ పరిధిలో 95 శాతం పెన్షన్ పంపిణీ జరిగినట్లు వారు తెలిపారు. పెన్షన్ తీసుకున్న ప్రతి లబ్ధి దారు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ను ఆశీర్వదించారని అన్నారు. అలాగే చిత్తూరు శాసనసభ్యులు గురజాల జగన్మోహన్ చిత్తూర్ నియోజకవర్గానికి చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలను ప్రజలు స్వాగతిస్తూ ఆయన చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలకు వెన్నంటి ఉన్నారని ఆయన ఆధ్వర్యంలో చిత్తూరు నియోజకవర్గంలో అభివృద్ధి చెందడం ఖాయమని తెలిపారని కూడా వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో 32 వ డివిజన్ కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జనం కోసమే
నేటి దినపత్రిక సూర్య

మీ అభిప్రాయాలే మా కథనాలు
నేటి దినపత్రిక సూర్యకు పాఠకులే మార్గ దర్శకులు, ప్రచురితమయ్యే ప్రతి కథనం, రోజువారి వార్తలపై మీ అభిప్రాయాలను మా దృష్టికి తీసుకువస్తే మరింత శ్రద్ధగా మీ అందరి ఆదరణ పొందేలా కృషి చేస్తామని ముకుళిత హస్తాలతో వేడుకుంటున్నాం.
మరింత సమాచారం అందించాల్సిన వారు ఎప్పుడైనా మీ అభిప్రాయాలను క్లుప్త ంగా తెలియచేయాలని, మీకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటామని తెలియచేస్తున్నాం.

కె.సురేష్‌బాబు (బ్రాంచ్ మేనేజర్) ఫోన్ నెంబర్ : 9346318232
ఎన్.లక్ష్మినారాయణ (రీజనల్ మేనేజర్) ఫోన్ నెంబర్ : 6301107116